హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామి వారికి అభిషేకాలు, సిందూరం, ఆకుపూజ వంటి అలంకరణలు చేశారు. అలాగే భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రతీ మంగళవారం ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణలతో పాటు పూజా కార్యక్రమాలు ఉంటాయని అర్చకుడు వెంకటరమణాచార్యులు తెలిపారు.

తార్నాక డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ


లాలాపేటలో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత అన్నారు. లాలాపేట, వినోభానగర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. దాదాపు దశాబ్ద కాలంగా కొనసాగుతున్న లాలాపేట రోడ్డు విస్తరణ పనులపై ఇంజినీరింగ్ డీఈ సువర్ణ, ఏఈ వేణుతో చర్చించారు. వినోభానగర్‌లోని శ్మశాన వాటికి అభివృద్ధి, సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సుభాష్, అనిల్, బోదాసు నర్సింహ తదితరులు ఉన్నారు.

ఓయూలో ఆర్కియాలజీ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వీసీ ప్రొ.కుమార్ ఆర్కియాలజీ పుస్తకాన్ని తన చాంబర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఇటీవల ఆర్కియాలజీ విభాగంలో జరిగిన జాతీయ సదస్సులో విద్యార్థులు, అధ్యాపకులు వివిధ అంశాలపై సమర్పించిన 120 పరిశోధన పత్రాలను క్రోడీకరించి అందులో ఎంపిక చేసిన 70 వ్యాసాలను పుస్తక రూపంలో ముద్రించినట్లు సదస్సు కన్వీనర్, ఎడిటర్ డా.శివానంద్ యాలల తెలిపారు. ఈ పుస్తకం పీహెచ్‌డీ విద్యార్థులకు ఎంతో ఉపయోపడుతుందన్నారు. కార్యక్రమంలో యూజీసీ డీన్, ఆర్కియాలజీ హెడ్ ప్రొ.లావణ్య, రిజిస్ట్రార్, ఓఎస్‌డీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

బంజారాహిల్స్: మద్యం మత్తులో అదుపు తప్పిన వేగంతో దూసుకెళ్తూ వేగాన్ని కంట్రోల్ చేయలేక ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టిన డ్రైవర్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. ఎస్సార్‌నగర్‌లో నివసించే రామరాజు సోమవారం రాత్రి టాటా వింగర్ ట్యాక్సీలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్–1లోని జీవీకేవన్ ఎదురుగా హయత్ ప్లేస్ హోటల్ వైపు నుంచి వేగంగా దూసుకెళ్తుండగా కారు అదుపుతప్పింది. ఇదే క్రమంలో అక్కడ ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారకుడైన రామరాజుకు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా మద్యం మత్తులో కారు నడుపుతున్నట్లుగా నిర్ధారణ అయ్యింది. దీంతో అతడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్ట్రానిక్ షాపులో చోరీ

వెంగళరావునగర్: ఎలక్ట్రానిక్ షాపులో చోరీ జరిగిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ఎస్.ప్రవీణ్‌కుమార్ మధురానగర్‌లోని ఎలక్ట్రానిక్ షాపులో స్టోర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 13వ తేదీన అదే షాపులో క్లస్టర్‌గా రికార్డులు పరిశీలించే వీరాంజనేయులు వచ్చి స్టోర్‌లో కొన్ని వస్తువులు కనిపించడం లేదని తెలియజేశాడు. ఈ నెల 11న వచ్చిన కొంతమంది కస్టమర్స్ వీటిని దొంగిలించి ఉంటారని భావిస్తున్నారు. వాటి విలువ దాదాపు రూ.41 వేలు ఉంటుందని అంచనా వేశారు. ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిలువ నీడ కరువాయే..!


తుకారాంగేట్ సుభాష్ విగ్రహం వద్ద బస్టాప్‌లో మండుటెండలో వేచివున్న ప్రయాణికులు

- అడ్డగుట్టలో కానరాని బస్‌షెల్టర్లు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్‌లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మురికి వాడగా పేరున్న ఇక్కడి నుంచి ప్రతిరోజు పెద్దసంఖ్యలో ప్రయాణికులు వివిధ పనుల కోసం బస్సుల్లో వెళ్తుంటారు. అయితే వారు వేచి ఉండేందుకు బస్ షెల్టర్లు కాని, కూర్చునేందుకు బెంచీలు లేకపోవడంతో ఎండలో ఎండుతూ.. వానలో తడుస్తూ బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. డివిజన్‌లోని అడ్డగుట్ట బస్టాండ్ మొదలుకుని తుకారాంగేట్, న్యూ బ్రిడ్జి, రైల్వే బాయ్స్, లాలాగూడ, శాంతినగర్ వరకు సుమారు 10 బస్టాప్‌లు ఉండగా, తొమ్మిది చోట్ల షెల్టర్లు లేక ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. లాలాగూడలో ఒకటి ఉన్నప్పటికీ నిర్వహణ లేక అధ్వానంగా మారడంతో ప్రయాణికులు అందులో ఉండలేక రోడ్డుపైనే బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు.

25 ఏళ్ల క్రితం బస్సు సౌకర్యం..

అడ్డగుట్టకు 25 ఏళ్ల క్రితం బస్సు సౌకర్యం కల్పించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా డివిజన్‌లో షెల్టర్లు మాత్రం ఏర్పాటు చేయలేదు. డివిజన్‌కు అసలే బస్సు సౌకర్యం అంతంత మాత్రమే. దీనికితోడు గంటల తరబడి బస్సుల కోసం రోడ్లపైనే వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తే తిప్పలు తప్పుతాయని ప్రయాణికులు కోరుతున్నారు.

భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం


షరీఫ్


కృష్ణమ్మ

కంటోన్మెంట్: భార్యతో గొడవపడి భర్త అదృశ్యమైన ఘటన బోయిన్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. బోయిన్‌పల్లిలో నివసించే అశాది సబిత (44)కు మల్లేశ్‌తో 28 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి కుమారుడు రాజు (26), కుమార్తె రాణి (24) ఉన్నారు. ఏడేళ్ల క్రితం మల్లేశ్ మృతి చెందాడు. 2023లో షరీఫ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడగా అదే ఏడాది నవంబర్‌లో పెళ్లి చేసుకున్నది. షరీఫ్‌కు అప్పటికే వివాహం అయి, ఇద్దరు అబ్బాయిలు, కుమార్తె ఉన్నారు. ఇరువైపులా కుటుంబాల వారు వీరి వివాహాన్ని వ్యతిరేకించినప్పటికీ చిన్నతోకట్టాలో ఓ అద్దె ఇంట్లో కలిసి ఉంటున్నారు. గత శనివారం ఉదయం 8.30 గంటలకు సబితను స్కూటీపై డ్రాప్ చేశాడు. మధ్యాహ్నం సబిత ఇంటికి వచ్చేసరికి షరీఫ్ ఇంట్లో లేడు. దీంతో పాటు దుస్తులు, వెండి ఆభరణాలతో పాటు రూ.12,000 నగదు కూడా కనిపించలేదు. దీంతో సబిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతి స్థిమితం లేని మహిళ ..

కంటోన్మెంట్: మతి స్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటిగడ్డ మన్యం (58) ఓల్డ్ బోయిన్‌పల్లిలోని అబ్బార్ రెసిడెన్సీలో మూడేళ్లుగా వాచ్‌మెన్‌గా పనిచేస్తూ, కుటుంబంతో అక్కడే ఉంటున్నాడు. మతిస్థిమితం లేని ఆయన సోదరి కృష్ణమ్మ (40) సైతం వీరితో పాటే నివసిస్తోంది. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో కృష్ణమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో సమీప ప్రాంతాలతో పాటు తెలిసిన వారి వద్ద విచారించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో మన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై తల్లిపై దాడి

సనత్‌నగర్: మద్యానికి బానిసైన కుమారుడు తల్లిపై రాడ్‌తో దాడి చేసి గాయపర్చిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతీనగర్ హరినగర్‌లోని హనుమాన్ ఆలయ సమీపంలో బైండ్ల నర్సింహులు, కమలమ్మ దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు రాము (25), లక్ష్మణ్ (25) ఉన్నారు. కమలమ్మ హౌస్‌కీపింగ్ పనులు చేస్తుంటుంది. పెద్ద కుమారుడు రాము జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లిని వేధిస్తుంటాడు. ఈనెల 12న మధ్యాహ్నం 12 గంటలకు కమలమ్మ తన ఇంట్లో పని చేయిస్తుండగా అక్కడి మేస్త్రీలతో రాము గొడవ పెట్టుకున్నాడు. దీంతో కమలమ్మ వద్దని వారించగా ఆమె తలపై ఇనుపరాడ్‌తో దాడి చేయగా తీవ్ర రక్తస్రావం జరిగింది. గొడవను అడ్డుకునేందుకు యత్నించిన చిన్న కుమారుడు లక్ష్మణ్‌పై కూడా దాడి చేశాడు. గతంలో జరిగిన గొడవలను దృష్టిలో పెట్టుకుని తనను చంపాలనే ఉద్దేశంతోనే తనపై దాడి చేసినట్లు కమలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి బరాత్‌లో గొడవ

సనత్‌నగర్: పెళ్లి బరాత్ (ఊరేగింపు)లో వెలుగుతున్న ట్యూబ్ లైట్లతో నృత్యం చేస్తున్న కొంతమంది యువకులు అదే లైట్లతో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట భగవంతాపూర్‌లో ఈనెల 11న అర్ధరాత్రి విజయ్‌కుమార్ కుమార్తె పెళ్లి సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. ఇందులో నిఖిల్, శివ, విజయ్‌కుమార్‌తో పాటు మరికొందరు ట్యూబ్‌లైట్లను తిప్పుతూ డ్యాన్స్ చేస్తున్నారు. ఆ సమయంలో అటుగా వచ్చిన నాచారం వెంకటేశ్‌కు ట్యూబ్‌లైట్ తగిలింది. దీంతో బాధితుడు ఇదేంటని ప్రశ్నించగా నిఖిల్, శివ, విజయ్‌కుమార్‌తో పాటు మరికొందరు ట్యూబ్‌లైట్లతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. బాధితుడికి తీవ్ర రక్తస్రావం కావడంతో చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ అపహరణ

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకుని వెళ్తుండగా గుర్తు తెలియని అగంతకుడు ఓ భక్తుడి సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యాడు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగింది. ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన ఆర్లగడ్డ రాజశేఖర్ తన కూతురితో కలిసి ఎల్లమ్మ ఆలయానికి వచ్చాడు. దర్శనం అనంతరం బయటకు రాగా అతడిని ఓ వ్యక్తి వెంబడిస్తూ ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నించాడు. అమ్మవారి ఫొటో కొనేందుకు అని చెప్పగా తనకు తెలిసిన షాపు ఉందని తీసుకువెళ్లాడు. ఫొటో కొన్నాక ఇంటికి వెళ్లేందుకు క్యాబ్ బుక్ చేయాలని కూతురుకి చెప్పాడు. క్యాబ్ రావడంతో కారులో ఎక్కుతుండగా వెనకాలే వచ్చిన సదరు వ్యక్తి రాజశేఖర్ చేతిలోని సెల్‌ఫోన్‌కు లాక్కుని పారిపోయాడు. పట్టుకునేందుకు ప్రయత్నించిన ఫలితం లేకుండాపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ వలలో చార్టర్డ్ అకౌంటెంట్

బంజారాహిల్స్: వదిన డీపీతో ఉన్న వాట్సాప్ నంబర్ నుంచి వచ్చిన సందేశాన్ని నమ్మిన ఓ చార్టర్డ్ అకౌంటెంట్ రూ.75 వేలు బదిలీ చేసి మోసపోయిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-5లోని శీతల్ ఎన్‌క్లేవ్‌లో చార్టర్డ్ అకౌంటెంట్ రాయప్రోలు వెంకట రమేశ్ నివాసం ఉంటున్నాడు. ఈనెల 3న ఉదయం తన వదిన డీపీతో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. అమెరికాలో ఉండే తన వదినే అని యూపీఐ ద్వారా రూ.50 వేలు బదిలీ చేశాడు. 3 గంటల తర్వాత మరో రూ.25 వేలు ట్రాన్స్‌ఫర్ చేయాలని అభ్యర్థన రావడంతో పంపించాడు. ఆ తర్వాత తన వదిన పేరిట ఎవరో ఆన్‌లైన్ మోసానికి పాల్పడ్డారని గ్రహించాడు. దీంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలోనే కంటోన్మెంట్‌లో భూబదలాయింపు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లోని రక్షణ, పౌర విమానయాన స్థలాల్లోని బస్తీవాసుల కల త్వరలోనే నెరవేరనుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. భూబదలాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం కలిసినట్లు తెలిపారు. ఆయన సూచనల మేరకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని సైతం కలిసి ఈ అంశంపై చర్చించామన్నారు. కలెక్టర్, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌తో ఫోన్లో మాట్లాడి, భూబదలాయింపునకు సంబంధించి వివరాలు సేకరించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని రక్షణ, పౌరవిమానయాన స్థలాల్లోని సెంట్రల్ బ్యాటరీ, చిన్న కమేలా, ఎడ్వర్డ్ కాంపౌండ్, సాయి బాబా హట్స్, మడ్‌ఫోర్ట్ హట్స్, రసూల్ పుర, అన్నానగర్, అర్జున్‌నగర్, 108 బజార్, రెడ్డి కాంపౌండ్, శ్రీలంక బస్తీ, తాడ్ బండ్, బోయిన్‌పల్లి శివాలయం బస్తీ, నందమూరి నగర్ లాంటి 14 బస్తీలలో నివసిస్తున్న దాదాపు 10 వేల కుటుంబాలకు మేలు కలుగుతుందన్నారు. గతంలో తాను సీఎం రేవంత్ రెడ్డిని కలవగా ఆయన ఆదేశాలతో భూబదలాయింపు ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు.


మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

వారం రోజుల్లో టీజీ ఈసెట్-2025 ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ ఈసెట్–2025 ఫలితాలను వారం రోజుల్లో ప్రకటించనున్నట్లు కన్వీనర్ ప్రొ.చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో జరిగిన ప్రవేశ పరీక్షకు 19,672 మంది దరఖాస్తు చేసుకోగా, 18,928 మంది (96.22) శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు.

గాంధీనగర్ నాలా పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..


పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

బన్సీలాల్‌పేట్: 'నాలా నిర్మాణానికి మోక్షమెప్పుడో' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా, జీహెచ్‌ఎంసీ యంత్రాంగం స్పందించింది. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు సదరు కాంట్రాక్టర్‌తో కలిసి గాంధీనగర్‌లో వరదనీటి నాలా పనులను సోమవారం ప్రారంభించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పనులను సకాలంలో పూర్తి చేస్తామని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఈఈ ఆంజనేయులు తెలిపారు.

ఘనంగా మదర్స్ డే వేడుకలు

రాంగోపాల్‌పేట్: క్వీర్ బందు అసోసియేషన్, వాసవీ కిన్నెర సంస్థ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో ట్రాన్స్‌జెండర్ తల్లిదండ్రులతో మదర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ట్రాన్స్‌జెండర్లు మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్లపై సమాజం పూర్తి వివక్ష చూపిస్తోందని కనీసం తల్లిదండ్రులు తమ బాధను అర్థం చేసుకుని ఆదరించినా చాలా సంతోషంగా ఉంటుందన్నారు. ఇప్పుడిప్పుడే కొందరు కుటుంబ సభ్యులు వారి బాధను అర్థం చేసుకుని ధైర్యం చెబుతున్నారని ఇలాంటి తల్లిదండ్రులు ఉండడం ఆనందం కలిగిస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో అడ్వకేట్ శ్యామల, సైకాలజిస్ట్ డాక్టర్ అనిత, కొండవీటి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీ ఈటల రాజేందర్ క్షమాపణ చెప్పాలి'

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం రేవంత్ రెడ్డిపై ఎంపీ ఈటల రాజేందర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఓయూ విద్యార్థి, యువజన నేతలు గాదె వెంకట్, హరినాథ్, కంపాటి వెంకట్, గోపాల్ దాస్, డా.జిల్లపల్లి నాగేశ్వర్ రావు, దూడపాక సురేశ్ మంగళవారం మాట్లాడుతూ.. ఈటల రాజేందర్ తనస్థాయిని, సీనియార్టీని మరిచి మాట్లాడడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. స్వార్థం కోసం బీజేపీ అధినాయకత్వం మెప్పు కోసం చిల్లర మాటలు మాట్లాడితే అధ్యక్ష పదవి వస్తుందనే భ్రమలో ఉన్నట్లు కనిపిస్తుందన్నారు. మరోసారి సీఎం, కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

యువకుడిపై హత్యాయత్నం

బంజారాహిల్స్: రోడ్డుకు అడ్డంగా బైక్‌లు ఎందుకు పార్కింగ్ చేశారంటూ ప్రశ్నించిన ఓ యువకుడిపై ఆరుగురు ఆగంతకులు దాడి చేసి గాయపర్చిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–2లోని ఇందిరానగర్‌లో ఉండే జొల్లు అరుణ్‌కుమార్, ఆయన బావమరిది సాయిరాం ఇద్దరూ కలిసి తెల్లవారుజామున టీ తాగడానికి కృష్ణానగర్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా రోడ్డుకు అడ్డంగా మూడు బైక్‌లు అక్రమంగా పార్కింగ్ చేసి ఉన్నాయి. ఇలా ఎందుకు పార్కింగ్ చేశారంటూ అరుణ్‌కుమార్, సాయిరాం ప్రశ్నించారు. ఆగ్రహంతో ఊగిపోయిన ఆరుగురు ఆగంతకులు సాయిరాంను తీవ్రంగా కొట్టడమే కాకుండా కత్తితో మెడ, చేయిపై పొడిచారు. అడ్డుకునే క్రమంలో ఛాతిపై కూడా గట్టిగా పొడవడంతో సాయిరాంకు తీవ్ర గాయాలయ్యాయి. తన బావమరిదిని హత్య చేసే ఉద్దేశ్యంతోనే ఆగంతకులు బైక్‌లు అడ్డంపెట్టి గొడవకు దిగి కత్తితో పొడిచారని అరుణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చికిత్స నిమిత్తం సాయిరాంను ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దాడి చేసిన వారి కోసం గాలింపు చేపట్టారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో 9 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు తమ ఆడ బిడ్డల పెళ్లికి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకే నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఖైరతాబాద్ తహసీల్ కార్యాలయ అధికారి సురేశ్, బీఆర్‌ఎస్ నేతలు శ్రీనివాస్‌గౌడ్, సంతోష్‌కుమార్, శ్రీహరి, నరేందర్, శేఖర్, ఆరీఫ్, గోపీలాల్‌చౌహాన్, కూతురు నర్సింహ, బలరాం, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో ప్రతినిధులు, విద్యార్థులు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

పద్మారావునగర్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌లోని మైత్రీ ఫౌండేషన్, లంబినీ నాలెడ్జ్ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ముత్యాల రాజేశ్, చైర్‌పర్సన్ సుధారాణి, బీఆర్‌ఎస్ నాయకుడు ఏనూరి మహేశ్, ఎస్సీఆర్పీ రాష్ట్ర అధ్యక్షులు డి. సుదర్శన్‌బాబు, గండి కృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజశేఖర్ తదితరులు మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీలో స్వీపర్‌గా పని చేస్తున్న ప్రవంతి భోలక్‌పూర్ బస్తీలో ఇద్దరు విద్యార్థులకు ఇంటి ముందే ఉచితంగా ట్యూషన్ మొదలు పెట్టగా, ప్రస్తుతం 50 మంది విద్యార్థులకు ప్రతిరోజు ట్యూషన్ చెప్పడం అభినందనీయమన్నారు. ఈ ట్యూషన్‌కు తమ ఫౌండేషన్ ద్వారా చేయూతనిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, బి. నర్సింగ్‌రావు, సత్యనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


'సాక్షి'లో ప్రచురితమైన కథనం


విద్యుత్ స్తంభాన్ని తొలగించిన దృశ్యం

లాలాపేట: స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదుట ఉన్న ఓ విద్యుత్ స్తంభం 4 రోజుల క్రితం పక్కనే ఉన్న చెట్లకొమ్మలకు ఆనుకుని ప్రమాదకరంగా మారింది. దీంతో 'చెట్ల కొమ్మలపై ఒరిగిన విద్యుత్ స్తంభం' అనే కథనం 'సాక్షి' దిన పత్రికలో సోమవారం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం విద్యుత్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఒరిగిన స్తంభాన్ని తొలగించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి' కి స్థానికులు, సోషల్ వర్కర్ నేతికార్ మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

16న సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్‌లో ఈనెల 16న ఉదయం 10.30 గంటలకు 'శాంతి చర్చలు–మేధో స్పందన' అనే అంశం పై రౌండ్ టేబుల్ సమావేశం జరగనున్నది. 'ఆపరేషన్ కగార్' పేరిట మధ్య భారత్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ఆపివేయాలని కేంద్ర ప్రభుత్వం విప్లవకారులతో తక్షణమే శాంతి చర్చలు జరపాలని ఓయూ విద్యార్థి సంఘాలు, పరిశోధక విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి ప్రతిఒక్కరూ హాజరుకావచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బొల్లారం: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం వార్డు 7 పెద్దకమేల బస్తీలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు బస్తీవాసులు తమ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ లేకపోవడం వల్ల చిన్న ఫంక్షన్ కోసం కూడా పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రేషన్ షాపు లేక తిరుమలగిరి వెళ్లాల్సి వస్తోందని, విద్యుత్ స్తంభాల కొరత, పైప్‌లైన్లు లేక తాగునీటి సమస్య, అంగన్వాడీ సెంటర్ లేక గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ.. బస్తీలో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని, అలాగే డ్రైనేజీ, ఇతర సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చిస్తానని హామీనిచ్చారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెద్దకమేల బస్తీలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీ గణేశ్